

8లో..

## హార్ట్ ఎటాక్‌తో మరో గెస్ట్ లెక్చరర్ మృతి

- 12 నెలలుగా అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులతో ఆగుతున్న గెస్ట్ గుండెలు
- ఆగమవుతున్న అతిథి అధ్యాపకుల కుటుంబాలు


# వరంగల్ వాయిస్

*Evening Daily*

సంపుటి : 05 | సంచిక : 014
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
డిసెంబర్ 17, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## ఘనంగా పెన్షనర్స్ డే..

☐ కన్నుల పండువగా 75 వసంతాల వేడుక



2లో..

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ

- ఎన్నికల తీరుతెన్నులపై అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్ష
- ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు సూచనలు

## ఘనంగా మహా పడిపూజ

- పురోహితుల ఆధ్వర్యంలో రంగశాయిపేటలో నిర్వహణ
- భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు



8లో..



2లో..

## ఓటు వేసిన ఇనగాల

ప్రశాంతంగా మూడో విడత పంచాయతీ ఎన్నికలు




- సిబ్బంది లేమితో ఇబ్బందులు
- రెగ్యులర్ పోస్టుల భర్తీని మరిచిన ప్రభుత్వం
- ఖాళీగానే పదవీ విరమణ పొందిన స్థానాలు
- ఒక్కో ఈఓకు 3 నుంచి 5 దేవస్థానాల ఇంచార్జి బాధ్యతలు
- పని భారంతో సతమతం
- ఔట్ సోర్సింగ్ పద్ధతిలోనైనా నియమించాలంటున్న భక్తులు

# దైవాదీనం..

## దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరత

దేవాలయాల్లో సేవలు దైవాదీనంగా మారాయి. నిరుపేదలు, మధ్య తరగతి భక్తులకు దైవ దర్శనం అందని ద్రాక్షలా మారింది. ఈ టెంపుల్.. ఆ టెంపుల్ అని కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అయితే సిబ్బంది కొరతే ఇందుకు ప్రధాన కారణంగా మారింది. దశాబ్దాలపాటు రెగ్యూలర్ పోస్టుల భర్తీ లేకపోవడంతోపాటు పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో భక్తుల కష్టాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. గత బీఆర్ఎస్ హయాంలోనే దేవాదాయ శాఖలో ఖాళీలు ఉన్నట్లు గుర్తించినా వాటిని భర్తీ చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహించింది. ఆలయాల్లో సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన ఈవోలు, పర్యవేక్షణ సిబ్బంది లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడంలేదు. ఒక్కో ఈవోకు మూడు నుంచి ఐదు దేవస్థానాల ఇంచార్జి బాధ్యతలు అప్పగించడంతో పాలన అటకెక్కింది. పని భారంతో ఆయా దేవాలయాలకు సేవలు అందించడంలో సిబ్బంది విఫలమవుతున్నారన్న ఫిర్యాదులున్నాయి. ప్రభుత్వం భక్తుల మనోభావాలతో ఆటలాడకుండా కనీసం ఔట్ సోర్సింగ్ పద్ధతిలోనైనా ఉద్యోగులు, సిబ్బంది నియామకాలు చేపట్టాలన్న డిమాండ్ ఉంది.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి



వివరాలు2లో..

# దైవాదీనం..

- దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరత
- సిబ్బంది లేమితో ఇబ్బందులు
- రెగ్యులర్ పోస్టుల భర్తీని మరిచిన ప్రభుత్వం
- ఖాళీగానే పదవీ విరమణ పొందిన స్థానాలు
- ఒక్కో ఈఓకు 3 నుంచి 5 దేవస్థానాల ఇంచార్జి బాధ్యతలు
- పని భారంతో సతమతం
- ఔట్ సోర్సింగ్ పద్ధతిలోనైనా నియమించాలంటున్న భక్తులు



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. దీంతో ఆలయాలపై పర్యవేక్షణ కొరవడింది. దేవాదాయ శాఖ పరిధిలో 704 ఆలయాలు ఉండగా నిబంధనల ప్రకారం 233 మంది కార్యనిర్వహణ అధికారులు ఉండాలి. కాని 164 మంది ఈవోలు మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఇంకా 69 ఈవో పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దీంతో ఒక్కో ఈవోకు 3 నుంచి 5 దేవస్థానాల ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. పనిభారం పెరగడంతో వాళ్లు పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. ఆలయ భూములు కబ్జాకు గురవుతున్నా రక్షించలేక చేతులెత్తేస్తున్నారు.

**పెరుగుతున్న భక్తులు..**

ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య దినదినాభివృద్ధి చెందుతోంది. పర్యాటక ప్రాంతమైన ఓరుగల్లులో దైవ దర్శనానికి వచ్చేవారు లెక్కకు మించి ఉంటున్నారు. పురాతన దేవాలయాలైన వేయి స్తంభాల గుడి, భద్రకాళి, మెట్టురామలింగేశ్వర స్వామి, ఐనవోలు మల్లికార్జున స్వామి, కురవి వీరభద్ర స్వామి, పాలకుర్తి సోమలింగేశ్వర స్వామి, చిల్పూరు శ్రీ వేంకటేశ్వర స్వామి, రామప్ప దేవాలయాలకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వీఐపీ, ప్రొటోకాల్ దర్శనాల తాకిడి కూడా సిబ్బందికి పనిభారం పెంచుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య భక్తులను పట్టించుకునేందుకు సిబ్బందికి సమయం ఉండడం లేదు. ఇక, పండగల సమయంలో పరిస్థితి ఆలయ అధికారుల చేతులు దాటిపోతోంది. సామాన్య భక్తులు వ్యక్తిగత క్రమశిక్షణను పాటించడమే తప్ప.. వారి గురించి ఆలోచించే సమయం, వారికి సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించే పరిస్థితి లేదు.

**కీలక పోస్టులు ఖాళీ..**

దేవాదాయ శాఖలో జాయింట్ కమిషనర్ (జేసీ) అనేది కీలక పోస్టు. ఆలయాల ఆస్తులు, లక్షల ఎకరాల భూములకు రక్షణ కల్పించాలంటే అదనపు కమిషనర్లు, జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ల (డీసీ) పోస్టుల్లో రెగ్యులర్ అధికారులు ఉండాలి. ప్రస్తుతం శాఖలో పైనుంచి కింద వరకు ఇంచార్జీలు, లేదంటే రెవెన్యూ అధికారులతో నింపేస్తున్నారు. డీసీ నియామకాలు, పదోన్నతులు లేకపోవడంతో ఆర్జేసీల కొరత కూడా వేధిస్తోంది. అసలు దేవాదాయ శాఖలో ఖాళీ పోస్టుల వివరాలపై స్పష్టత కరువైంది. అసలు ఈ శాఖలో మొత్తం ఎంత మంది ఉద్యోగులు ఉన్నారు. ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయనే విషయంలో అధికారుల్లో క్లారిటీ లేదు. అసిస్టెంట్ కమిషనర్లు 27 మందికి 13 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 14 ఖాళీలు ఉన్నాయి. గ్రేడ్-1 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు 39 పోస్టులకు గాను 33 మంది పనిచేస్తున్నారు. ఆరు ఖాళీలున్నాయి. గ్రేడ్-3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల 127 మందికి 67 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 60 ఖాళీలున్నాయి. జూనియర్ అసిస్టెంట్లు 16 మందికి గాను ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 13 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

**ఔట్ సోర్సింగ్ లోనైనా..**

దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరత సమస్యగా మారుతోంది. రోజు రోజుకు ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుండగా, ఉద్యోగులు, సిబ్బంది సంఖ్య తగ్గుతోంది. దశాబ్దాలపాటు రెగ్యులర్ పోస్టుల భర్తీ లేకపోవడంతోపాటు పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో భక్తుల కష్టాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. గత బీఆర్ఎస్ హయాంలోనే దేవాదాయ శాఖలో ఖాళీలు ఉన్నట్లు గుర్తించినా వాటిని భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహించింది. దీంతో భక్తుల కష్టాలు రెట్టింపయ్యాయి. రెగ్యులర్ పోస్టులు లేనందున ప్రభుత్వం వెంటనే స్పందించి ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులు, సిబ్బంది నియమించడం ద్వారా భక్తుల సమస్యలకు పరిష్కార మార్గం చూపించవచ్చన్న భావన వ్యక్తమవుతోంది. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని భక్తులు వేడుకుంటున్నారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం జరిగిన గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికల సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ సందర్శించారు. జనగామ జిల్లాలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన భద్రతతోపాటు ఎన్నికలు జరుగుతున్న తీరుతెన్నులపై పోలీసు కమిషనర్ అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్, ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కమిషనర్ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీపీ వెంట వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీ రవి, ఏసీపీ నర్సయ్యతో పాటు స్థానిక ఇన్ స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ఓటు వేసిన ఇనగాల వెంకటరామిరెడ్డి

**ప్రశాంతంగా మూడో విడత పంచాయతీ ఎన్నికలు**



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు 16 గ్రామాల్లో మూడో విడత సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 88 శాతం ఓటింగ్ పోలైనట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఐ సంతోష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఎన్నికలకు భారీ బందోబస్తు నిర్వహించారు. హనుమకొండ జిల్లా పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ ఆత్మకూరు మండల కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళని, బందోబస్తును పర్యవేక్షించారు. వరంగల్ కుడా చైర్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకటరామిరెడ్డి ఆయన సతీమణి అవంతి రెడ్డి దంపతులు స్వగ్రామమైన ఆత్మకూరు మండల కేంద్రంలో ఆరవ వార్డు ఆత్మకూరులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కునువినియోగించుకున్నారు.



## ఘనంగా పెన్షనర్స్ డే..

**కన్నుల పండువగా 75 వసంతాల వేడుక**

**వరంగల్ వాయిస్, హన్మకొండ:** టీజీ ఎన్పీడీసీఎల్ పెన్షనర్ల సన్మానోత్సవం పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. బుధవారం వడ్డేపల్లిలోని పల్లా రవీందర్ రెడ్డి స్మారక భవన్ లో రిటైర్డ్ సీజీఎం పెరుమాండ్ల మదన్ మోహన్ నేతృత్వంలో 75 వసంతాల వేడుక కన్నుల పండువగా జరిగింది. ఎంతో అట్టహాసంగా జరిగిన ఈ పెన్షనర్స్ డే కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్డీ అండ్ ఐఆర్ డైరెక్టర్ సి.ప్రభాకర్, విద్యుత్ శాఖ పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు ఎ.మచ్చేంద్రయ్య, గడ్డం లక్ష్మీనారాయణ, ఎస్.వెంకట్ నరసయ్య, కె.రాజమౌళి, జి.వెంకటేశ్వర స్వామి, కె.అశోక్ రెడ్డి, బి.మొగిలయ్య, సీహెచ్.సమ్మయ్య, అరసం వీర మల్లయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, ఆడెపు రమణయ్య, కుమారస్వామి తదితరులతోపాటు డివిజన్ల బాధ్యులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్డీ అండ్ ఐఆర్ డైరెక్టర్ సి.ప్రభాకర్ మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షన్ దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నప్పటికీ తనను నేరుగా కలవవచ్చన్నారు. పదవీ విరమణ పొందిన వారికోసం పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా 2026 హాండ్ బుక్కును డైరెక్టర్ ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ వేడుకను పురస్కరించుకొని 32 మంది రిటైర్డ్ ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. నా భూతో.. నా భవిష్యత్ అన్న రీతిలో జరిగిన ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలతో పాటు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పెరుమాండ్ల మదన్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

**గడ్డం లక్ష్మీనారాయణకు ఘన సన్మానం..**

విద్యుత్ శాఖలో మూడున్నర దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో పనిచేసి, ప్రస్తుతం పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లో కీలకంగా వ్యవహరిస్తున్న గడ్డం లక్ష్మీనారాయణతో పాటు ఆయన సతీమణి జయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. పెన్షనర్స్ డే సందర్భంగా టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్డీ అండ్ డైరెక్టర్ సి.ప్రభాకర్, పూర్వ సీజీఎం పెరుమాండ్ల మదన్మోహన్ తదితరులు వీరిని శాలువతో సత్కరించి, మెమొంటో అందజేశారు. విద్యుత్ శాఖలో ఎల్డీసీ స్థాయి నుంచి అకౌంట్ ఆఫీసర్ వరకు లక్ష్మీనారాయణ చేసిన సేవలను వీరు శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు గడ్డం లక్ష్మీనారాయణ-జయలక్ష్మి దంపతులు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, డిసెంబర్ 17, 2025

# వీబీ-జీరామ్ జీ బిల్లు ఉపసంహరించుకోవాలి


## ▪ తాటిపాముల వెంకట్రాములు డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి, దాని స్థానంలో వీబీ-జీరామ్ జీ (వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్- గ్రామీణ) పేరుతో లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రికి వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ, మోదీ పాలనలో పేదలకు కొత్తగా చేసిందేమీ లేదని, పైగా ఉన్న పథకాల నిధులలో కోత పెడుతూ పేదల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడం దుర్మార్గమని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం 90 శాతం కేంద్ర నిధులు, 10 శాతం రాష్ట్ర నిధులతో నడుస్తున్న ఉపాధి పథకాన్ని మార్చి, 60 శాతం కేంద్ర నిధులు, 40 శాతం రాష్ట్ర నిధులుగా చట్టం చేస్తే రాష్ట్ర ప్రభుత్వాలపై పెనుభారం పడుతుందని వెంకట్రాములు పేర్కొన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి సంవత్సరంలో 200 రోజులు పనులు కల్పించాలి. రోజుకు రూ. 700 కూలీ ఇవ్వాలి. ఈ డిమాండ్లు నెరవేర్చని పక్షంలో శ్రమజీవుల పోరాటాలు ఉధృతమవుతాయని వెంకట్రాములు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దెల ఎల్లేశ్, జిల్లా అధ్యక్షులు మునిగాల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, అలువాల రాజు, జూకంటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యా వ్యవస్థను రద్దు చేయాలి

## న్యాయవాది కలకోటి మహేందర్ డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీరుపై ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ప్రైవేట్ విద్యా వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని న్యాయవాది కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యలో విద్యార్థుల తల్లిదండ్రులు అధిక ఫీజుల రూపంలో దోపిడీకి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలు సైతం నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమవుతున్నాయని మహేందర్ అభిప్రాయపడ్డారు. పాఠశాలలను బట్టి ఫీజులు, విద్య అందుతుందని, సాధారణ ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల సాధారణ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీపడలేకపోతున్నారని తెలిపారు. అంతేకాకుండా, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని ఆయన అన్నారు. అందరికీ సమాన విద్య అందాలంటే ప్రైవేట్ విద్యా వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని మహేందర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధుల, బడా పారిశ్రామికవేత్తల పిల్లలు మొదలుకొని సాధాణ కూలి పని చేసుకునే వ్యక్తి పిల్లల వరకు ఒకే పాఠశాల, ఒకే విద్యా వ్యవస్థ ఉండాలి. అప్పుడే ప్రభుత్వం, అధికారులు నాణ్యమైన విద్యను సాధారణ ప్రజలకు అందించగలరు.” సమాజంలో ఉన్న విద్యార్థులందరికీ ఒకే విద్యా వ్యవస్థను తీసుకురావాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ దిశగా తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులను ప్రశ్నించాలని న్యాయవాది కలకోటి మహేందర్ సూచించారు.

# మచ్చాపూర్‌లో పెరిక కుల డిజిటల్ సర్వే



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మచ్చాపూర్ గ్రామంలో తెలంగాణ పెరిక కుల సంఘం (రి. నెం.766/2014) ఆధ్వర్యంలో చేపట్టిన పెరిక కుల డిజిటల్ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా అధ్యక్షుడు అల్లం రాజేశ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లం రాజేశ్ వర్మ మాట్లాడుతూ పెరిక కుల జనగణన (డిజిటల్ సర్వే) వల్ల కులస్తులకు కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. ఈ సర్వే ద్వారా కుల జనాభా, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల వివరాలు తెలుస్తాయని, దీని ఆధారంగా ప్రభుత్వపరంగా తమకు రావాల్సిన హక్కులు, పథకాలు పొందడానికి వీలవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మచ్చాపూర్ సర్పంచ్ బొడకుంట్ల ప్రకాశ్ - మానస దంపతులు, మచ్చాపూర్ మాజీ సర్పంచ్ నరిశెట్టి నరేందర్, మాజీ సర్పంచ్ అంకతి నాగేశ్వర రావు, పెరిక కుల నాయకులు వనపర్తి ధర్మరాజు, పత్తిపాక నారాయణ, పత్తిపాక లింగమూర్తి, తిప్పని శ్రీశైలం, అర్సం యాకయ్య, చింతం రాజుకుమార్, మేడిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ శివారులో కారు పల్టీ

## అక్కడిక్కడే మహిళ మృతి



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండలంలోని నర్సాపూర్ గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై చల్లా రాజు తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న అల్వాల దేవేందర్ తన సొంత గ్రామమైన నర్సంపేట మండలం గురిజాలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చారు. ఓటు వేసిన అనంతరం తిరిగి భూపాలపల్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నర్సాపూర్ మూలమలుపు వద్ద వీరి కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో దేవేందర్ భార్య అపర్ణ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** మండల నూతన సర్పంచులను పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ఘనంగా సన్మానించారు. పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచులకు సూచించారు. ప్రజలు తమపై ఉంచిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నా

# మున్నూరు కాపు సంక్షేమానికి అండగా ఉంటా

## ◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణ పనులను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మున్నూరు కాపుల సంక్షేమానికి తమ వంతు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా కేవలం శంకుస్థాపనలకే పరిమితమైన ఈ భవన నిర్మాణం తమ ప్రభుత్వ హయాంలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదట రూ.5కోట్లుగా ఉన్న భవన నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.7 కోట్లకు రీ-ఎస్టిమేట్ చేయించి, నిధులు మంజూరు చేయడంతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేశామని పేర్కొన్నారు.ఈ భవనం జిల్లా మున్నూరు కాపు సోదరులకు ఒక కీలక మైలురాయిగా నిలవడమే కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు కుల బాంధవులు మాట్లాడుతూ జిల్లాలో మున్నూరు కాపుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ గతంలో తమ కమ్యూనిటీకి తగిన ప్రాధాన్యం దక్కలేదని తెలిపారు. అలాంటి పరిస్థితిని మార్చి, భవన నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి జిల్లా మున్నూరు కాపు సంఘం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కమిటీ కన్వీనర్‌గా ఈవీ శ్రీనివాస్ రావుని కుల బాంధవులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఈ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, భవన నిర్మాణ కన్వీనర్‌గా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. నిధులు మంజూరు చేయడంలో సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, అలాగే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవన నిర్మాణాన్ని నాణ్యతతో, పారదర్శకంగా, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంద ఐలయ్య, కటకం పెంటయ్య, గైనేని రాజన్, కోరబోయిన సాంబయ్య, తోట వెంకన్న, దేవర కొండ విజయలక్ష్మి సురేందర్, వేల్పుల మోహన్ రావు, పుప్పాల ప్రభాకర్, ఏనుగుల రాంప్రసాద్, కొత్త దశరథం, సాయిని రవీందర్, పాటి శ్రీనివాస్, మందాటి మహేందర్, కనుకుంట్ల రవి కుమార్, కందుల సృజన్, పెరికారి శ్రీధర్, పెంచాల గోపాల్, బక్కి రాజ్కుమార్, మాడిశెట్టి రాజకుమార్, సతీష్, పుప్పాల రజిని కాంత్, కొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్‌గా భగవాన్ రెడ్డి నియామకం

## సన్మానించిన బేతి సతీష్ యాదవ్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్:** పంచాయతీరాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్గా నియమితులైన బైరెడ్డి భగవాన్ రెడ్డిని బుధవారం రామంజాపూర్‌లో ఐజేయూ (ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్) ములుగు జిల్లా ఉపాధ్యక్షులు బేతి సతీష్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ములుగు జిల్లా ఉపాధ్యక్షులు దొంతరవేన కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు భగవాన్ రెడ్డిని శాలువాతో సన్మానించి, ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ, తమ వెంకటాపూర్ మండలానికి చెందిన భగవాన్ రెడ్డికి నామినేటెడ్ పదవి లభించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. భగవాన్ రెడ్డి నియామకానికి కృషి చేసిన మంత్రి సీతక్కకి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ తో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెన్షనర్ల సేవలు అమూల్యం

## ■ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, కాజీపేట:** పెన్షనర్ డే సందర్భంగా కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశాభివృద్ధికి తమ జీవితాన్ని అంకితం చేసిన పెన్షనర్ల సేవలు అమూల్యమైనవి అని కొనియాడారు. ప్రభుత్వ శాఖల్లో నిబద్ధతతో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగుల కృషి వల్లే నేడు వ్యవస్థలు బలంగా నిలబడగలిగాయని ఆయన అన్నారు. రిటైర్మెంట్ తరువాత కూడా సమాజానికి మార్గనిర్దేశకులుగా ఉండే పెన్షనర్ల అనుభవం యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ పెన్షనర్లను ఎమ్మెల్యే సన్మానించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించిన ఆయన, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయ శ్రీ రజాలి, డివిజన్ అధ్యక్షులు అజ్గర్, నాయకులు గుంటి కుమార్, సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, మధు, సమ్మయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# కేయూ క్యాంపస్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఉద్యోగులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు పుట్టినరోజు వేడుకలను ప్రపంచమంతా జరుపుకుంటుందని, దానిలో భాగంగా బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయంలో జరుపుకోవడం చాలా సంతోషకరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ యేసు చూపిన బాటలో నడవాలని, ఏసు తెలిపిన మంచిని ఆచరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కంట్రోలర్ ప్రొఫెసర్ శ్రీనివాస్, డాక్టర్ ఆసిఫ్ ఇక్బాల్, ఏఆర్ నేతాజీ, వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ప్రతాప్, బొక్క మొగిలి, కిరణ్ కుమార్, భిక్షపతి, తిరుపతి, నందయ్య, దామోదర్, వినయ్, తిరుమలసింగ్, దేవమ్మ, కవిత, సునీతతో పాటు టీచింగ్, నాన్–టీచింగ్ ఉద్యోగులందరూ పాల్గొన్నారు.

# సెల్యూట్ పోలీస్ అన్నా..



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట:** మండలంలోని బోజేరువు గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ చేసిన పనికి ప్రజలు 'సెల్యూట్ పోలీస్ అన్నా' అని అభినందిస్తున్నారు. ఆయన పని తీరు పలువురి ప్రశంసలు అందుకుంటోంది. గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వైపు నడుస్తూ ఇబ్బంది పడుతున్న విధానాన్ని హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ గమనించారు. వెంటనే స్పందించిన ఆయన, ఆ వృద్ధురాలిని తన భుజాలపై ఎత్తుకుని పోలింగ్ కేంద్రం లోపలికి సురక్షితంగా మోసుకెళ్లారు. ఒక హెడ్ కానిస్టేబుల్ తన విధి నిర్వహణలో మానవత్వాన్ని చూపిన ఈ దృశ్యం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఘటనతో జయరాజ్ పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు.

# సొంత గడ్డపై పట్టు నిలుపుకున్న 'ఇనగాల'



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, రాజకీయ క్షేత్రంలో తనదైన ముద్ర వేసుకున్నారు. ముఖ్యంగా, డీసీసీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన వెంటనే తన సొంత గ్రామమైన ఆత్మకూరులో కాంగ్రెస్ జెండాను ఎగురవేసి ఆయన సత్తా చాటారు. ఆత్మకూరు గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పర్వతగిరి మహేశ్వరిని సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలిపించుకోవడంలో కీలక పాత్ర పోషించారు. జిల్లా స్థాయి బాధ్యతల్లో ఉంటూనే, క్షేత్రస్థాయిలో గ్రామ రాజకీయాలను పక్కా వ్యూహంతో చక్కదిద్ది పర్వతగిరి మహేశ్వరిని గెలిపించారు. ఈ విజయం ఆయన రాజకీయ పట్టును నిరూపించడమే కాకుండా, డీసీసీ అధ్యక్షుడిగా నైతిక బలాన్ని ఇవ్వడంతో పాటు, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని, నమ్మకాన్ని కలిగించింది. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కేవలం స్వంత మండలంపైనే కాకుండా, హుస్నాబాద్, హుజూరాబాద్, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాల నియోజకవర్గాలలోని మొత్తం 12 మండలాలలో కూడా జిల్లా స్థాయి బాధ్యతల్లో ఉంటూనే, క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించి కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపడానికి కృషి చేస్తున్నారు.

# ఘనంగా ప్రేయర్ పవర్ చర్చిలో ఫ్రీ క్రిస్మస్

## ◆ హాజరైన విష్ణువర్ధన్ రెడ్డి, కార్పొరేటర్ మామిండ్ల రాజు



**వరంగల్ వాయిస్, న్యూశాయంపేట:** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 31వ డివిజన్ న్యూ శాయంపేటలో ఉన్న ప్రేయర్ పవర్ చర్చిలో ఫ్రీ క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ క్రిస్మస్ ఆరాధన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు తెలంగాణ కాంగ్రెస్ యువజన నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడుతూ, చర్చి సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ యేసుక్రీస్తు మీ అందరిని సుఖసంతోషాలతో ఉంచాలని వారు ఆకాంక్షించారు. అనంతరం కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ, న్యూ శాయంపేటలోని ప్రేయర్ పవర్ చర్చిలో క్రిస్మస్ జరుపుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని అన్నారు. మీరందరూ ఏసుక్రీస్తు కృపలో సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. బెస్ట్ సిటిజెన్ అవార్డు గ్రహీత వేల్పుల వేణుగోపాల్ మాట్లాడుతూ చర్చి కుటుంబ సభ్యులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేయర్ పవర్ చర్చి పాస్టర్ థామస్ రెడ్డి, సంఘ సభ్యులు, సంఘ పెద్దలు కలిసి ముఖ్య అతిథులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి, 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంకేష్ సురేందర్, దీపక్ రెడ్డి, కౌటిల్ రెడ్డి, నన్నే బోయిన రాజు, మామిండ్ల సురేష్, ఎడ్ల కన్నయ్య, ఆరెల్లి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్ట సవరణను వ్యతిరేకించాలి

## ■ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త గ్రామీణ ఉపాధి బిల్లును తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ చర్యను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరును ఉద్దేశపూర్వకంగా తొలగించడం కేవలం పరిపాలనా మార్పు కాదని, గాంధీజీ విలువలు మరియు వారసత్వం పట్ల బీజేపీ ధిక్కారాన్ని బహిర్గతం చేసే లోతైన ఫాసిస్ట్ సైద్ధాంతిక చర్య అని శ్రీనివాసరావు మండిపడ్డారు. బీజేపీ, దాని సైద్ధాంతిక మార్గదర్శకులు గాడ్సే నిజమైన శిష్యులని ఈ చర్య ధృవీకరిస్తుందని ఆయన అన్నారు. హక్కుల ఆధారిత చట్టాన్ని రద్దు చేసి, దానిని విచక్షణా పథకంగా మార్చడం ద్వారా, ప్రభుత్వం హామీ ఇచ్చిన ఉపాధి ఆలోచననే బలహీనపరుస్తోందని శ్రీనివాసరావు విమర్శించారు. దీనివల్ల గ్రామీణ కార్మికులను అధికారిక కోటాలు, కాంట్రాక్టర్ ఆధారిత యంత్రాంగాల దయకు వదిలివేసినట్లు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూపీఏ ప్రభుత్వం వామపక్షాల మద్దతుతో అమలు చేసిన ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ, పని హక్కు అనే రాజ్యాంగ భావనకు ఒక మూలస్తంభం లాంటిదని, ఇది రాష్ట్ర విధానం ఆదేశిక సూత్రాల నుంచి నేరుగా వచ్చిందని ఆయన గుర్తు చేశారు. "ఈ చట్టం గ్రామీణ భారతదేశంలో కనీస వేతనాన్ని సంస్థాగతీకరించింది. దీని నిబంధనలను నీరుగార్చడం తప్పనిసరిగా గ్రామీణ కార్మికుల దోపిడీకి దారితీస్తుంది." ప్రతిపాదిత బిల్లులో సంవత్సరానికి పని దినాలను 125కు పెంచుతామని కాగితంపై పేర్కొంటున్నప్పటికీ, పథకం డిమాండ్ ఆధారిత స్వభావాన్ని తొలగిస్తుంది. దీని వలన కార్మికులు ఉపాధిని డిమాండ్ చేసే హక్కును సమర్థవంతంగా కోల్పోతారు. ఫలితంగా, కార్మికులు కాంట్రాక్టర్లు, స్థానిక అధికారులు, భూస్వాములకు లోబడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం గ్రామీణ డిమాండ్‌ను నిలబెట్టడంలో, ముఖ్యంగా కోవిడ్ సంక్షోభ సమయంలో భారత ఆర్థిక వ్యవస్థను మాంద్యం నుండి కాపాడటంలో కీలక పాత్ర పోషించిందని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కొత్త బిల్లు ఆర్థిక భారంలో 40% రాష్ట్ర ప్రభుత్వాలపై మోపుతుంది. దీనివల్ల జీఎస్టీ తప్పుడుతనం, కేంద్ర ఉదాసీనత కారణంగా ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని తెలిపారు. "విస్తృత సంప్రదింపులు లేకుండా, వేతనాలు మరియు హామీ ఇవ్వబడిన పనిదినాల పెంపుపై స్పష్టమైన దృష్టి పెట్టకుండా ఇంత విస్తృతమైన మార్పును ఎప్పుడూ ప్రవేశపెట్టకూడదు," అని శ్రీనివాసరావు నొక్కి చెప్పారు. ఈ కార్మిక వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చర్యను దేశవ్యాప్తంగా కార్మికులు, ప్రజాస్వామ్య శక్తులు గట్టిగా ప్రతిఘటిస్తాయని సీపీఐ తరపున ఆయన హెచ్చరించారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ అన్ని జిల్లాల్లో నిరసనలు నిర్వహించాలని సీపీఐ పార్టీ యూనిట్లకు పిలుపునిచ్చారు.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, డిసెంబర్ 17, 2025

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

■ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ సాయి శ్రీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** అపరిచిత వ్యక్తులు, సామాజిక మాధ్యమాల్లో తమ వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసుకోవద్దని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ సాయి శ్రీ హెచ్చరించారు. "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" కార్యక్రమంలో భాగంగా, సైబర్ సెక్యూరిటీ వింగ్ వరంగల్ కమిషన్ విభాగం ఆధ్వర్యంలో బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్పీ సాయి శ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ డైరెక్టర్ షికా గోయల్ ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో పాటు విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ డిజిటల్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్‌లు, పెట్టుబడి మోసాలు, మ్యాట్రిమోనీ, ట్రేడింగ్ యాప్‌ల ద్వారా ఏ విధంగా మోసాలకు పాల్పడుతున్నారో ఆమె వివరించారు. ఇలాంటి సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ఎస్పీ వివరించడంతో పాటు, ఒకవేళ ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతే తక్షణమే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అదేవిధంగా, http://www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా, మోసపోకుండా ముందుగానే అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట వేయగలమని ఎస్పీ తెలియజేశారు. అనంతరం సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ వింగ్ వరంగల్ విభాగం డీఎస్పీ గిరికుమార్, ఇన్‌స్పెక్టర్లు యాసిన్, అశోక్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్, ఎస్ఐలు చరణ్ కుమార్, శివ కుమార్, ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ అబ్దుల్ రహీమ్ షేక్, హెచ్ఓడీలు, ఇతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కేయూ అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేయండి

■ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను సిద్ధం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి యూనివర్సిటీ అధికారులను కోరారు. 'పెన్షనర్స్ డే' సందర్భంగా కేయూ సెనెట్ హాల్, కామర్స్ కళాశాలలో నిర్వహించిన విశ్రాంత బోధనా, బోధనేతర ఉద్యోగుల సమావేశంలో ఆయన ఈ సూచన చేశారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం ఒక దేవాలయం లాంటిదని, దాని అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం ముందుంటుందని హామీ ఇచ్చారు. వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉందని, అదే దిశగా విశ్వవిద్యాలయ అభివృద్ధి కూడా సాగాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, కేయూ అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని బకాయిలను పూర్తిగా క్లియర్ చేసినట్లు తెలిపారు. ఇకపై డీఏ (డియర్నెస్ అలవెన్స్)ను ప్రతి నెల క్రమం తప్పకుండా చెల్లించేలా ఆదేశాలు జారీ చేసినట్లు ప్రకటించారు. గోల్డెన్ జూబిలీ సంవత్సరంలోకి అడుగుపెట్టిన కాకతీయ విశ్వవిద్యాలయం కీర్తిని మరింత పెంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా ఉండాలని వీసీ పిలుపునిచ్చారు. బోధనా ఉద్యోగుల సమావేశంలో ఆచార్య ఎ. సదానందం, ఆచార్య రవీందర్, ఆచార్య వీరన్న, ఆచార్య ఎర్రగట్టు స్వామి, ఆచార్య కే. వెంకటనారాయణ, ఆచార్య రామిరెడ్డి, ఆచార్య సమ్మయ్య పాల్గొన్నారు. మాజీ ఉపకులపతులు ఆచార్య వి. గోపాల్ రెడ్డి, ఆచార్య ఇక్బాల్ అలీ, ఆచార్య సీతారామారావు తదితరులు హాజరయ్యారు. బోధనేతర ఉద్యోగుల సమావేశంలో డాక్టర్ సంజీవరావు, డాక్టర్ నాగేశ్వర్ రావు, నరసింహ మూర్తి, ఎన్.ఎస్.ఆర్. మూర్తి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ యువ క్రీడోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల వేడుకలలో భాగంగా, కాకతీయ యువ క్రీడోత్సవాల బ్రోచర్‌ను బుధవారం వీసీ చాంబర్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొ.కె.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ "క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, నాయకత్వ లక్షణాల పెంపునకు కీలకమని" అన్నారు. యువ క్రీడోత్సవం విద్యార్థులలో క్రీడాస్ఫూర్తి, జట్టు భావన, ఆరోగ్యకరమైన పోటీ మనస్తత్వాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొ.వి.రామచంద్రం కూడా మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థి వికాసానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. వ్యాయామ కళాశాల, స్పోర్ట్స్ బోర్డ్ సహకారంతో విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల విద్యార్థుల కోసం డీన్, స్టూడెంట్ అఫైర్స్ ఈ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొ.మామిడాల ఇస్తారి తెలిపారు. ఈ క్రీడోత్సవం ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందించడమే కాకుండా, విద్యార్థులకు క్రీడల ద్వారా సమగ్ర అభివృద్ధి కల్పించడం అని ఇస్తారి అన్నారు. క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక చైతన్యానికి, ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడతాయని ఆయన తెలిపారు. ఈ క్రీడోత్సవాల్లో కేయూ క్యాంపస్‌తో పాటు సుబేదారి, హన్మకొండలో ఉన్న అనుబంధ పీజీ కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించబడతాయి. క్రికెట్ (పురుషులు), వాలీబాల్ (పురుషులు & మహిళలు), 400 మీటర్ల పరుగు (మహిళలు), 800 మీటర్ల పరుగు (పురుషులు), ఖో–ఖో (మహిళలు) పోటీలు జనవరి 12 నుంచి 23 వరకు జరుగుతాయిని జట్ల పేర్ల సమర్పణకు చివరి తేదీ జనవరి 5 అని తెలిపారు. అన్ని అనుబంధ కళాశాలల విద్యార్థులు తమ జట్లను డీన్, స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుందని ఇస్తారి సూచించారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.వి.రామచంద్రం, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొ.మామిడాల ఇస్తారి, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డా.భాస్కర్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొ. వెంకయ్యలు, పాలక మండలి సభ్యులు డా.చిర్ర రాజులు పాల్గొన్నారు.

# సెంట్రల్ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా పెన్షనర్ల డే వేడుకలు




**వరంగల్ వాయిస్, హన్మకొండ:** పెన్షనర్ల డే సందర్భంగా హన్మకొండలోని సెంట్రల్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రిటైర్డ్ ఉద్యోగులు, పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేసి పెన్షనర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి రిటైర్డ్ ఉద్యోగులు అందించిన సేవలు అమూల్యమైనవి అని కొనియాడారు. తమ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాలకు, అన్ని వేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న క్రిస్టియన్ సోదర సోదరీమణులకు ఎటువంటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి తాను పూర్తి స్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సంఘ నాయకులు, పాస్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

# వరంగల్ ఇనుప ఖనిజ నిల్వలపై కేంద్రం నిర్లక్ష్యం

■ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** వరంగల్ జిల్లాలో భారీగా గుర్తించిన ఇనుప ఖనిజ నిల్వల అభివృద్ధి పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా.కడియం కావ్య ఆరోపించారు. ఈ మేరకు ఆమె బుధవారం పార్లమెంట్‌లో ఖనిజ సంపద, గనుల అభివృద్ధి, పర్యావరణ అనుమతులు, స్థానిక సంస్థలకు ఆదాయ భాగస్వామ్యంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. వరంగల్ జిల్లాలో సుమారు 40 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో అంగీకరించినప్పటికీ, గనుల అభివృద్ధి ఎందుకు ముందుకు సాగడం లేదనే విషయాన్ని ఎంపీ లేవనెత్తారు. ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సమాధానమిస్తూ భారతీయ గనుల బ్యూరో (ఐబీఎం) నిర్వహించే జాతీయ ఖనిజ జాబితా (నేషనల్ మినరల్ ఇన్వెంటరీ) ప్రకారం, 2025 ఏప్రిల్ 1 నాటికి ఈ ఇనుప ఖనిజ నిల్వలు 'రిమైనింగ్ రిసోర్సెస్' (మిగిలిన వనరులు) కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. అయితే, ఇప్పటివరకు వరంగల్ జిల్లాలో ఒక్క ప్రధాన ఖనిజ గని లీజు కూడా మంజూరు కాలేదని, ఒక్క ఖనిజ బ్లాక్ కూడా వేలం వేయలేదని స్పష్టమైంది. జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉన్నప్పటికీ, ఉపాధి అవకాశాలు, స్థానిక అభివృద్ధి, గ్రామ పంచాయతీలకు ఆదాయం వంటి ప్రయోజనాలు ప్రజలకు దక్కని పరిస్థితి కొనసాగుతోందని ఎంపీ డా.కడియం కావ్య విమర్శించారు. గనుల అభివృద్ధిపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, తెలంగాణ ప్రాంతాల పట్ల వివక్ష చూపుతోందని ఆమె ఆరోపించారు. వరంగల్ వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని, ఖనిజ సంపదను ప్రజల సంక్షేమానికి ఉపయోగించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీ డా.కడియం కావ్య ఈ సందర్భంగా కోరారు.

# ధర్మారం నూతన సర్పంచ్‌గా ఎల్లస్వామి

## 180 ఓట్ల మెజారిటీతో విజయం



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బోసిక ఎల్లస్వామి ఎన్నికయ్యారు. ఉప ఎన్నిక జరిగిన ఈ స్థానంలో ఆయన తన ప్రత్యర్థిపై 180 ఓట్ల అధిక మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ ఎల్లస్వామి మాట్లాడుతూ తన మీద నమ్మకంతో గెలిపించిన గ్రామ ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని తెలిపారు. గ్రామ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని. ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటానని. గ్రామంలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

# 20న ఘనంగా శివానంద మూర్తి గురు జయంతి వేడుకలు

## అత్యంత వైభవంగా పూజలు



**వరంగల్ వాయిస్, ములుగు రోడ్డు :** వరంగల్ ములుగు రోడ్డులోని సప్త ధామంలో పరమపూజ్య శ్రీ శివానంద మూర్తి గురు 97వ జయంతి వేడుకలను ఈ నెల 20న అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు.బుధవారం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, గోపీచంద్ గురువు ప్రాముఖ్యతను వివరించారు. గురువే శివుడని, శివుడే గురువు అని, శివుడిని ఆరాధిస్తేనే గురువు దొరుకుతారని, గురువు దొరకడానికి పూర్వజన్మ సుకృతం ఉండాలని ఆయన అన్నారు. కారణజన్ముడైన శివానంద మూర్తి గారి జయంతి వేడుకలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పరమ గురువుని సేవించాలని పిలుపునిచ్చారు. ఉదయం 9:00 – 10:00అభిషేకం, ఉదయం 10:00 తర్వాత ఆనంద సౌధ ప్రారంభోత్సవం, ఉదయం 11:00 గురు వందనం కార్యక్రమం (పూజ్య గురుదేవుల పాదుక పూజ, అర్చన, హారతి), ఈ సంవత్సరం పూజా కార్యక్రమాన్ని అత్యంత విలువైన స్పటికాలు, పగడాలు, బిల్వ పత్రాలు, రకరకాల పుష్పాలతో కన్నుల పండుగగా, మనసు నిండుగా ఉండేలా ఏర్పాటు చేశామని ట్రస్టీ గోపీచంద్ తెలిపారు. ఈ పూజలో భక్తులందరూ సమిష్టిగా పాల్గొనవచ్చని, దీని ద్వారా సద్గురు చరణ అరవిందాలకు పూజించినట్లు అవుతుందని, అది ముక్తికి హేతువని ఆయన అన్నారు.మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ మాట్లాడుతూ వచ్చిన భక్తులందరికి తీర్థప్రసాదాలు, సందేశం కార్డు ఇవ్వడం జరుగుతుందని, అంతేకాకుండా అందరికీ భోజన వసతి కూడా ఏర్పాటు చేశామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బండారు సాయి నారాయణ, గందే ఉమాశంకర్, అనుదీప్ సహా ఇతర భక్తులు పాల్గొన్నారు.

# ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

## కాంగ్రెస్ ఇంఛార్జి వొడితెల ప్రణవ్



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్:** హుజూరాబాద్ మండల పరిధిలోని సింగపూర్ గ్రామంలో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వొడితెల ప్రణవ్ కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం అని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో సురక్షిత పాలనకు నాంది పలకాలని, గ్రామం బాగుంటేనే దేశం బాగుంటుందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి.. ఉప సర్పంచ్‌గా గెలిచి

**వరంగల్ వాయిస్, సంగారెడ్డి :** ఊరికి సేవ చేయాలనే బలమైన సంకల్పంతో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన ఉద్యోగాన్ని వదిలిపెట్టి, స్థానిక రాజకీయాల్లోకి అడుగుపెట్టి ఉప సర్పంచ్‌గా గెలుపొందాడు. వివరాల్లోకి వెళితే... సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం, మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేసేవారు. ఆయన తల్లిదండ్రులు గతంలో 18 ఏళ్లపాటు గ్రామంలో పదవుల్లో ఉండి సేవ చేశారు. వారి బాటలోనే నడుస్తూ, గ్రామానికి సేవ చేయాలని ప్రవీణ్ నిర్ణయించుకున్నారు. ఉద్యోగాన్ని వదిలి గ్రామానికి వచ్చిన ప్రవీణ్, ఇటీవల జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలని భావించినప్పటికీ, రిజర్వేషన్ అనుకూలించలేదు. దీంతో ఆయన తన అనుచరుడిని సర్పంచ్‌గా గెలిపించుకోవడంలో కీలక పాత్ర పోషించారు. ప్రవీణ్ స్వయంగా వార్డు మెంబర్‌గా విజయం సాధించి, ఉప సర్పంచ్ పదవిని దక్కించుకున్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులు తాను కోరుకున్నట్లే రావడంతో ప్రవీణ్ సంతోషం వ్యక్తం చేశారు. తామిద్దరం కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి పాటుపడతామని, మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఏబీసీ నూతన యూనిట్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశం
- కుక్కల శస్త్ర చికిత్స కేంద్రం, సీసీ రోడ్ల పరిశీలన




**వరంగల్ వాయిస్, బల్దియా :** అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రంలో నూతనంగా నిర్మించిన యూనిట్ (షెడ్)ను త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన హసన్‌పర్తి సమీపంలో జీడబ్ల్యూఎంసీ నిర్వహిస్తున్న ఏబీసీ కేంద్రాన్ని సందర్శించడంతో పాటు, హన్మకొండ పరిధిలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్ల పనులను బిల్లు చెల్లింపుల కోసం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఏబీసీ కేంద్రంలో కొత్తగా 50 కెనాల్స్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన షెడ్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుక్కలకు ఎక్కువ సంఖ్యలో శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి వీలుగా ఈ కొత్త షెడ్‌ను ఏర్పాటు చేశామని, వెంటనే దాని ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. డాగ్స్ షెడ్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, వాటికి వినియోగించే వ్యాక్సిన్‌లను పరిశుభ్రమైన పరిస్థితుల్లో నిల్వ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం, కమిషనర్ హన్మకొండ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మితమైన సీసీ రోడ్లను కొలతలు వేసి పరిశీలించారు. 56వ డివిజన్ పరిమళ కాలనీ, 60వ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేజ్–2, 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ డాక్టర్ కాలనీ, 49వ డివిజన్ జూలై వాడను సందర్శించి సీసీ రోడ్ల నిర్మాణ తీరు పట్ల కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవి కుమార్, డీఈలు సారంగం, రవి కిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కంట్రోల్ రూమ్‌లో ఎన్నికల తీరు పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో జరుగుతున్న మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుంచి జరుగుతున్న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకులు బాలమాయాదేవి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడో విడతలో నర్సంపేట, ఖనాపూర్, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల్లోని గుర్తించిన 110 సెన్సిటివ్, 282 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కార్యాలయంతో



పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి నేరుగా వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఈ నాలుగు మండలాలకు సూక్ష్మ పరిశీలకులను (మైక్రో అబ్జర్వర్లు) నియమించి, పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డీపీఓ కల్పన, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

**వరంగల్ వాయిస్, ఓ సిటీ :** ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీ జెండాను మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తెలిపారు. బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఓ సిటీ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులు, విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించగా, వారి సాధకబాధకాలను సహృదయంతో విన్న కొండా మురళి, సంబంధిత అధికారులతో అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ... ఏ సమస్య ఉన్నా ఎలాంటి పైరవీలు చేయకుండా తన ఆఫీస్‌కి వచ్చి నిర్భయంగా తనను సంప్రదించవచ్చని ప్రజలకు స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వాలు మారినా, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, పార్టీ జెండా మోస్తూ కృషి చేస్తున్న కార్యకర్తలకు సరైన గుర్తింపు వచ్చేలా, వారికి కావలసిన పదవులు దక్కేలా కృషి చేస్తానని కొండా మురళి హామీ ఇచ్చారు. అందరం కలిసిమెలిసి, ఐక్యమత్యంగా ఉండాలన్నారు. కార్యకర్తలకు, నాయకులకు పార్టీ పరంగా గౌరవ మర్యాదలు దక్కే విధంగా తాను పాటు పడతానని తెలిపారు. కొండా దంపతులు వరంగల్ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటారని, ఎలాంటి ఆపద సమయాల్లోనైనా తమ ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని కొండా మురళి స్పష్టం చేశారు.

# మరో హిందీ మూవీలో తమన్నా



తెలుగు, తమిళం, హిందీతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.



# బాస్టియన్ రెస్టారెంట్‌పై కేసు

## హైకోర్టును ఆశ్రయించిన నటి శిల్పాశెట్టి

బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ 'బాస్టియన్' బెంగళూరుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బెంగళూరు పోలీసులు ఈ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. అయితే రెస్టారెంట్‌పై కేసు నమోదు చేయడంపై శిల్పశెట్టి తీవ్రంగా స్పందించింది. ఈ రెస్టారెంట్‌పై వచ్చిన వార్తలను శిల్పా శెట్టి ఖండిస్తూ.. బుధవారం సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.తమపై తమ రెస్టారెంట్‌పై వస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమైనవని. కొందరూ కావాలనే తమ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఈ వివాదానికి క్రిమినల్ రంగు పూస్తున్నారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఇప్పటికే తాము హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశాము. ప్రస్తుతం ఈ విషయం కోర్టు పరిధిలో ఉన్నందున మీడియా సంస్థలు సంయమనం పాటించాలని ఆమె కోరారు. తాము దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామని, దేశ న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని' శిల్పా శెట్టి పేర్కొన్నారు. బిజినెస్‌మెన్ రంజిత్ బింద్రా స్థాపించిన 'బాస్టియన్ హాస్పిటాలిటీ'లో 2019లో పెట్టుబడి పెట్టిన శిల్పా శెట్టికి ఇందులో 50 శాతం భాగస్వామ్యం ఉంది. బెంగళూరులో అత్యంత ఖరీదైన పబ్‌లలో ఒకటిగా పేరొందిన బాస్టియన్, ఇప్పుడు వరుస వివాదాలతో వార్తల్లో నిలిచింది.

# రొమ్ము క్యాన్సర్ మహిళలకు ఆపరేషన్లు

## సోనూసూద్ మరో బృహత్తర కార్యక్రమం

ఇప్పటికే ఎంతోమందికి సాయం చేసి సోనూసూద్ రియల్ లైఫ్ హీరో అనిపించుకున్నారు. ఆపదలో, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. తాజాగా మరోసారి ఆయన తన మంచి మనసును చాటుకున్నారు. తన ఫౌండేషన్ ద్వారా దేశంలో ఉన్న 500 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ చికిత్స చేయించినట్లు వెల్లడిరచారు. దేశంలోని మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంపై మరింత దృష్టిసారించినట్లు తెలిపారు. మొత్తం 500కి పైగా శస్త్రచికిత్సలు జరిగాయి. 500 మంది మహిళలను మేం కాపాడగలిగాం. వారంతా కొత్త జీవితాన్ని పొందారు. వారి కుటుంబాల్లో ఆనందం నింపినందుకు నేనెంతో సంతోషంగా ఉన్నాను. సమష్టి కృషి ద్వారా మాత్రమే ఇలాంటి గొప్ప పనులు జరుగుతాయని సోనూసూద్ తెలిపారు. వైద్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఇది ప్రారంభం మాత్రమేనని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేయడంలో తానెప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. సోనూసూద్ గొప్ప మనసు చాటుకోవడం ఇదే తొలిసారి కాదు. కరోనా సమయం నుంచి ఆయన తరచూ ఇలాంటి పనులు చేస్తూనే ఉన్నారు. సినిమాల్లో విలన్ పాత్రల్లో నటించిన ఆయన లాక్‌డౌన్ కాలంలో వలస కూలీలను తన సొంత ఖర్చులతో సొంతూళ్లకు పంపించడం ద్వారా రియల్ హీరోగా జనం హృదయాల్లో చోటు దక్కించుకున్నారు. ఆ తర్వాత నుంచి సోషల్ మీడియా వేదికగా తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ వారికి సాయం చేస్తున్నారు.



# ఓటీటీలో ఆకట్టుకుంటున్న కాంత



మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం కాంత . సెల్వమణి సెల్వరాజ్ డైరెక్షన్‌లో పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 14న విడుదలైంది. తమిళంలో కాంత చిత్రానికి సాలిడ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద తన ప్రభావాన్ని చూపించడంలో విఫలమైంది. తెలుగులో మాత్రం ఈ చిత్రాన్ని బోరింగ్‌గా ఫీలయ్యారు. ఈ మూవీ ఓటీటీలో మంచి రెస్పాన్స్ రాబట్టుకుంటోంది. ఇటీవలే పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో పలు ప్రధాన భాషల్లో విడుదలైంది కాంత. తాజా అప్‌డేట్ ప్రకారం కాంత చిత్రానికి ఓపెనింగ్ వీకెండ్‌లో 1.1 మిలియన్ వ్యూస్‌తో అద్భుతమైన స్పందన వచ్చింది. ఓటీటీలో విడుదలైన ఫస్ట్ వీకెండ్‌లో 1 మిలియన్ వ్యూస్ అధిగమించిన 17వ కోలీవుడ్ సినిమాగా కూడా నిలిచింది కాంత. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. సముద్రఖని, రానా కీలక పాత్రల్లో నటించారు. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు.

8
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, డిసెంబర్ 17, 2025



# ఘనంగా మహా పడిపూజ

- పురోహితుల ఆధ్వర్యంలో రంగశాయిపేటలో నిర్వహణ
- భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రంగశాయిపేటలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలో అయ్యప్ప సేవ పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయము 10 గంటలకు మహా పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక గ్రామ పురోహితులు వెల్లిదే నరసింహమూర్తి, ప్రభాకర్ శాస్త్రి , భార్గవ్ శర్మ, ప్రదీప్ శాస్త్రి ఆధ్వర్యంలో నేత్ర పర్వంగా నిర్వహించారు. వేద మంత్రాలతో అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. రంగశాయిపేట, తిమ్మాపురం, నాయుడు పంప్, శంభునిపేట, ఉర్సు, కరీమాబాద్, శివనగర్ ప్రాంతాల నుంచి స్వాములు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి పూజలో పాల్గొన్నారు. గురు స్వామి కొల్లూరి యోగానంద్ బృందం ఆలపించిన అయ్యప్ప భక్తి పాటలు అందరినీ ఉర్రూతలూగించాయి. రంగసాయిపేట



ప్రాంతంలో ప్రతి వీధికి మైకు అమర్చడంతో ఉదయం నుంచి అయ్యప్ప పడిపూజ పూర్తయ్యేవరకు ఈ ప్రాంతం అయ్యప్ప నామస్మరణతో నిండుకుంది. భక్తులు స్వామివారి పడిపూజను కనులారా తిలకించారు. స్వామివారిని దర్శించుకుని తరించారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, నగర మేయర్, 42 వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణ చందర్, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, తొర్రూర్ గురు స్వామి కృపాకర్, మానసా దేవి ఉపాసకులు కాశీతాంత్రికులు చారు గుండ్ల లక్ష్మీనారాయణ గురుస్వామి, అయ్యప్ప సేవా పరపతి సంఘం అధ్యక్షుడు కొల్లూరి యోగానంద్, ప్రధాన కార్యదర్శి గంధ్రతి కుమార్, కోశాధికారి అనుమాండ్ల రమేష్, గౌరవ సభ్యులు కత్తి ఎల్ల గౌడ్, బజ్జూరి వీరేశం, దామరకొండ కరుణాకర్, కొండ్రెడ్డి నవీన్ రెడ్డి దంపతులు, బూరుగుపల్లి శ్రీనివాస్ దంపతులు, గరిగే నవీన్ దంపతులు, కర్నే రవి, ఆలయ పూజారి శ్రీధరాచార్యులు, అభిజిత్ దేవుళ్ళ పెళ్లి మధు, అడుప వేణు, కోక చలపతి, కంచ మల్లయ్య, రంజిత్ కుమార్, రాజు, భక్తులు పాల్గొన్నారు.

# మంత్రి వ్యాఖ్యలపై భగ్గుమన్న స్వపక్షం

- పీసీసీ సభ్యుడు నల్గొండ రమేష్ ఇంట్లో మీడియా సమావేశం

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** మంత్రి సురేఖ వ్యాఖ్యలపై వరంగల్ తూర్పు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఘాటుగా స్పందించారు. మీరంటున్న చిల్లరగాళ్లే మీ విజయంలో కీలకపాత్ర పోషించిన విషయం మరిచారా అంటూ నిలదీశారు. పట్టిన జెండా విడవకుండా కాంగ్రెస్ పార్టీ కోసం నలభై ఏండ్లుగా పనిచేస్తున్నామని ప్రకటించారు. పీసీసీ సభ్యుడు నల్గొండ రమేష్ ఇంట్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. మంత్రి చిల్లర గాళ్లంటూ సీనియర్ల మనోభావాలను దెబ్బతీసిన మాటలను వారు తీవ్రంగా ఖండించారు. వైఎస్ఆర్సీపీ, టీఆర్ఎస్, కాంగ్రెస్ అంటూ పార్టీలు మారింది ఎవరో ఆత్మ పరిశీలన చేసుకోవాలంటూ హితవు పలికారు. శాసనసభ ఎన్నికల్లో తేనేటి విందులు పెట్టి అందరినీ ఏకం చేసి మెజార్టీతో గెలిపించింది మర్చిపోయారా అంటూ నిలదీశారు. ఈ రోజు ఆ తేనేటి విందులే మింగుడు పడని విషంగా మారాయా మీకు అంటూ ప్రశ్నించారు. పార్టీ పరువును రోడ్డు కీడుస్తూ చిల్లర పనులు



చేసింది ఎవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల్లో మీకు వ్యతిరేకంగా ప్రచారం చేసి, మీరు ఓడిపోయేందుకు పథకం రచించిన కార్పొరేటర్ లనే నేడు అక్కున చేర్చుకుని అసలైన కాంగ్రెస్ వాదులను చిల్లరగాండ్లు అంటూ ప్రస్తావించడంపై మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో మంత్రి హోదాలో ఉండి ఏ పార్టీకి మెజార్టీ ఇచ్చారో ప్రజలకు, అధిష్టానానికి తెలుసన్నారు. ఏ పార్టీకి పోయి వచ్చినా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిపించిన ఘనత సీనియర్లదే అని గుర్తుంచుకోవాలన్నారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలవాలంటే ఓ రౌడీ షీటర్ అనుమతి తీసుకోవాలం అంటూ ప్రశ్నించారు. ఓ మాజీ రౌడీషీటర్ చేతిలో వరంగల్ తూర్పు భవిష్యత్తును పెట్టారంటూ మండిపడ్డారు. ఇంతకన్నా చిల్లర మరేం ఉంటుందన్నారు. స్వపక్షం, ప్రతిపక్షం తేడా లేకుండా అక్రమ కేసులు పెట్టిన ఘనత మీది కదా అంటూ నిలదీశారు. పార్టీలో కార్యకర్త హోదా లేని వ్యక్తి దగ్గరికి కార్పొరేటర్లు, నాయకులు వెళ్లాలా అన్నారు. కాంగ్రెస్ సీనియర్లను చిల్లర గాళ్లు అన్న మాటలను మంత్రి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గంలోని పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# హార్ట్ ఎటాక్‌తో మరో గెస్ట్ లెక్చరర్ మృతి

- 12 నెలలుగా అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులతో ఆగుతున్న గెస్ట్ గుండెలు
- ఆగమవుతున్న అతిథి అధ్యాపకుల కుటుంబాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత 15 రోజుల్లోనే హార్ట్ ఎటాక్ తో ముగ్గురు గెస్ట్ లెక్చరర్లు మరణించారు. గత రెండేళ్లలో దాదాపుగా 8 మంది మరణించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన క్యాతం రమేష్ అనే ఫిజిక్స్ అతిథి అధ్యాపకుడు రంగారెడ్డి జిల్లా బీహెచ్ఈఎల్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కూతుర్లు, మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో హార్ట్ ఎటాక్ తో మరణించినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు.జీతాలు రాకపోవడంతో ,ఆర్థిక ఇబ్బందుల వల్ల ,కుటుంబ పోషణ భారం ,పిల్ల చదువులకు ఫీజులు చెల్లించడం కష్టంగా మారడంతో మానసిక క్షోభకు గురి కావడంతో హార్ట్ ఎటాక్ కు గురైనట్లు పలువురు అతిథి అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగికి ఒక్క రెండు రోజులు వేతనాలు అటు ఇటుగా వస్తెనే ఆగం ఆగం అవుతారు. అలాంటిది అతిథి ఉద్యోగుల వేతనాలు , పని విషయంలో ఇంత నిర్లక్ష్యం ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. గత విద్యా సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చ్ నెలలకు గాను పనిచేసిన జీతాలు ఇప్పటివరకు చెల్లించకపోవడం వల్ల అతిథి ఆధ్యాపకులు ఆర్థికంగా, మానసికంగా ఆవేదనకు గురవుతున్నారు.

### దీనికి ప్రధాన కారణం ఎవరు?

అసలు ఈ చావులకు కారణం ఎవరు ?మన ప్రభుత్వమా? ఇంటర్ బోర్డు కమీషనరా? అని పలువురు విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. సంవత్సరం గడిచిన పని చేసిన కాలానికి జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమై, పలువురు అతిథి అధ్యాపకులు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ప్రజా ప్రభుత్వంలో గత ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ అనుసరించి సుమారు 1200 మంది కొత్త అధ్యాపకులను నియమించినప్పటికీ, మిగిలిన ఖాళీల బోధనకు అతిథి అధ్యాపకులను నియమించిన ప్రభుత్వం , గత విద్యా సంవత్సరం జీతాలు చెల్లించడంలో తాత్సారం చేస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ఆలోచించి, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అతిథి అధ్యాపకులకు 45 వేల జీతాన్ని 12 నెలలకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అతిథి ఆధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామెర ప్రభాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మృతి చెందిన ఫిజిక్స్ అతిథి అధ్యాపకుడు రమేష్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అతిథి అధ్యాపకుల రాష్ట్ర కమిటీ తరపున రాష్ట్ర కార్యదర్శి దార్ల భాస్కర్, అసోసియేట్ అధ్యక్షుడు మహేష్, అతిథి అధ్యాపకుల రాష్ట్ర నాయకులు ఐలీ సదానందం గౌడ్, కనకరాజు, యాదయ్య, శశిధర్,మహేందర్, పాండు, రాజ్ కుమార్,రమేష్,కళ్యాణ్,రాజేందర్,నరేష్, జంగయ్య తదితరులు సంతాపం ప్రకటించారు.

# 22న ప్రమాణ స్వీకారం

- ముగిసిన పంచాయితీ పోరు
- మూడో విడతలోనూ కాంగ్రెస్ దే హవా

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ నెల 20వ తేదీన బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. అయితే, ముహూర్తాల కారణంగా బాధ్యతల స్వీకరణ రెండు రోజులు వెనక్కి జరిగింది. డిసెంబర్ 20వ తేదీన అమావాస్య కావడంతో సరైన ముహూర్తాలు లేనందున 22కు వాయిదా వేయాలని ప్రజా ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. వారి విజ్ఞప్తులపై పంచాయతీరాజ్ శాఖ సానుకూలంగా స్పందించింది. సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ తేదీని 20 నుంచి 22వ తేదీకి మార్పు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే రోజున నూతన సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించనున్నారు. డిసెంబర్ 22వ తేదీన జరిగే మొదటి సమావేశంలో కొత్త పాలకవర్గాలు ప్రమాణస్వీకారం చేయనున్నాయి.

### ముగిసిన పోరు..

బుధవారం జరిగిన మూడో విడతలో 3,752 గ్రామ పంచాయతీలకు, 28,410 వార్డులకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో సుమారు 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ సాగింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com